చేయందించారు..మెజారిటీ ఇచ్చారు

- 'రేవూరికి' గీసుకొండలో అత్యధికం, దామెరలో అత్యల్ప మెజారిటీ
- 'కేఆర్'కు అండగా నిలిచిన ఐనవోలు
- ఒక్క మండలంలో కూడా 'కారు'కు వరించని మెజారిటీ


రేవూరి ప్రకాశ్‌రెడ్డి


కేఆర్ నాగరాజు

పరకాల: అసెంబ్లీ ఎన్నికల్లో పరకాల, వర్ధన్నపేట నియోజవర్గ ప్రజలు కాంగ్రెస్ పార్టీకి చేయ్యందించి మెజారిటీతో గెలిపించారు. పరకాల కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రవూరి ప్రకాశ్‌రెడ్డికి గీసుకొండ మండలంలో అత్యధిక మెజారిటీ రావడంతో పాటు దామెర మండలంలో అత్యల్పంగా వచ్చింది. పరకాల నియోజకవర్గంలో 2,22,972 ఓట్లకు 1,88,898 ఓట్లు 239 పోలింగ్ కేంద్రాల ద్వారా పోల్ అయ్యాయి. అందులో బీజేపీకి 38,735 ఓట్లు, బీఆర్ఎస్ 64,632, కాంగ్రెస్ 64,632 ఓట్లు పోలయ్యాయి. మండలాల వారీగా బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీలకు పోలైన ఓట్లు వివరాలు ఇలా ఉన్నాయి. నడికూడ మండలంలో (31) పోలింగ్ స్టేషన్ పరిధిలో 28,760 ఓట్లకు 24,615 ఓట్లు పోలయ్యాయి. వాటిలో బీజేపీకి 6,159, బీఆర్ఎస్ 7,901, కాంగ్రెస్–8,374 ఓటు రాగా కాంగ్రెస్‌కు 473 మెజారిటీ లభించింది. పరకాల మండలంలోని 10 గ్రామాలు (19) పోలింగ్ స్టేషన్ పరిధిలో 14,869 ఓట్లకు 12,966 ఓట్లు పోలయ్యాయి. వాటిలో బీజేపీకి 2,400, బీఆర్ఎస్ 4,499, కాంగ్రెస్ 5,158 ఓట్లు రాగా కాంగ్రెస్‌కు 659 మెజారిటీ లభించింది. పరకాల మున్సిపాలిటీ (26) పోలింగ్ స్టేషన్ పరిధిలో 26,157 ఓట్లకు 19,936 ఓట్లు పోల్ అయ్యాయి. అందులో బీజేపీకి 6,174, బీఆర్ఎస్ 5,803, కాంగ్రెస్ 6,909 ఓట్ల వచ్చాయి. దీంతో కాంగ్రెస్‌కు 1,106 ఓట్ల మెజారిటీ లభించింది. దామెర మండలంలో(24) పోలింగ్ కేంద్రం పరిధిలో 21,705 ఓట్లు ఉండగా 19,404 ఓట్లు పోలయ్యాయి. వాటిలో బీజేపీకి 4,540, బీఆర్ఎస్ 6,713, కాంగ్రెస్ 6,814 ఓట్లు రాగా కాంగ్రెస్‌కు 101 ఓట్ల అత్యల్ప మెజారిటీ లభించింది. ఆత్మకూరు మండలం (32) పోలింగ్ స్టేషన్‌ల పరిధిలో 27,921 ఓట్లకు 24,519 ఓట్లు పోలయ్యాయి. వాటిలో బీజేపీ 4,270, బీఆర్ఎస్ 8,077, కాంగ్రెస్ 10,581 రాగా కాంగ్రెస్‌కు 2504 ఓట్ల మెజారిటీ లభించింది. గీసుగొండ మండలం(32) పోలింగ్ స్టేషన్‌ల పరిధిలో 28,420 ఓట్లు ఉండగా 24,106 ఓట్లు పోలయ్యాయి. వాటిలో బీజేపీ 3,042, బీఆర్ఎస్ 8,262, కాంగ్రెస్ 11,341 రాగా కాంగ్రెస్‌కు 3,079 అత్యధిక మెజారిటీ లభించింది. సంగెం మండలంలో (45) పోలింగ్ స్టేషన్‌ల పరిధిలో 41,417 ఓట్లకు 35,984 ఓట్లు పోలయ్యాయి. వాటిలో బీజేపీ 6,220, బీఆర్ఎస్ 13,267, కాంగ్రెస్ 14,041 ఓట్ల సాధించగా కాంగ్రెస్‌కు 774 ఓట్ల మెజారిటీ లభించింది. అదే విధంగా గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో (32) పోలింగ్ స్టేషన్‌ల పరిధిలో 32,187 ఓట్లకు 25,832 ఓట్లు పోలయ్యాయి. వాటిలో బీజేపీ 5,788, బీఆర్ఎస్ 9,808, కాంగ్రెస్ 8,524 ఓట్లు పోల్‌కాగా కాంగ్రెస్‌కు 774 ఓట్ల మెజారిటీ వచ్చింది. పోస్టల్ బ్యాలెట్‌లో మొత్తం 1,536 ఓట్లు పోల్ అవ్వగా బీజేపీ 142, బీఆర్ఎస్ 302, కాంగ్రెస్ 831 వచ్చాయి. దీంతో అన్ని మండలాలతో కలిపి పరకాల కాంగ్రెస్ అభ్యర్థి రేవూరి ప్రకాశ్‌రెడ్డికి 7,941 ఓట్ల మెజారిటీ లభించింది.

'కేఆర్'కు ఐనవోలులో 3,740 ఓట్ల ఆధిక్యం

ఐనవోలు: అసెంబ్లీ ఎన్నికల్లో వర్ధన్నపేట నియోజకర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కేఆర్ నాగరాజుకు మండల ప్రజలకు అండగా నిలిచారు. 107 వర్ధన్నపేట శాసనసభకు జరిగిన ఎన్నికల్లో కేఆర్ నాగరాజు సమీప బీఆర్ఎస్ అభ్యర్థి అరూరి రమేష్‌పై 19,458 ఓట్ల తేడాతో గెలుపొందినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారులు ప్రకటించారు. ఐనవోలు మండలం వివరాల్లోకి వెళ్తే.. వర్ధన్నపేట శాసనసభ నియోజకవర్గ పరిధిలో మండలంలోని 16 గ్రామాలు ఉన్నాయి. అందులో 35 బూత్‌లు ఏర్పాటు చేయగా 30,062 ఓట్లు ఉండగా 25,990 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 14 మంది అభ్యర్థులు పోటీచేయగా.. బీఆర్ఎస్ అభ్యర్థి అరూరి రమేష్‌కు 9748,, కాంగ్రెస్ అభ్యర్థి కర్నన్ నాగరాజుకు 13,488, బీజేపీ అభ్యర్థి కొండేటి శ్రీధర్‌కు 1,226 ఓట్లు రాగా మిగిలిన 11 మంది అభ్యర్థులకు 1200 ఓట్లు మాత్రమే వచ్చాయి. అదే విధంగా 368 మంది ఓటర్లు నోటాకు ఓటు వేశారు. కాగా మండల వ్యాప్తంగా కాంగ్రెస్ అభ్యర్థి కేఆర్ నాగరాజుకు 3,740 ఓట్ల మెజారిటీ కట్టబెట్టారు. దీంతో మండల వ్యాప్తంగా ఆయా గ్రామాల్లో కాంగ్రెస్ శ్రేణులు సంబురాలు జరిపారు. వనమాల కనపర్తిలో బీఆర్ఎస్‌కు 657, కాంగ్రెస్‌కు 643, నర్సింహులగూడెంలో బీఆర్ఎస్‌కు 430, కాంగ్రెస్‌కు 264, ముల్కలగూడెంలో బీఆర్ఎస్‌కు 586, కాంగ్రెస్‌కు 452 ఓట్లు పోలయ్యాయి. ఈ మూడు గ్రామాల్లో బీఆర్ఎస్‌కు 314 లీడ్ వచ్చింది. కొండపర్తిలో బీఆర్ఎస్‌కు 1,182, కాంగ్రెస్ 1,413, సింగారంలో బీఆర్ఎస్‌కు 597, కాంగ్రెస్‌కు 847, ఐనవోలులో బీఆర్ఎస్‌కు 1,282, కాంగ్రెస్‌కు 2053, ఒంటిమామిడిపల్లిలో బీఆర్ఎస్‌కు 689, కాంగ్రెస్‌కు 886, పున్నేలులో బీఆర్ఎస్‌కు 931, కాంగ్రెస్‌కు 1,514, పెరుమాండ్లగూడెంలో బీఆర్ఎస్‌కు 222, కాంగ్రెస్‌కు 517, పంథినిలో బీఆర్ఎస్‌కు 982, కాంగ్రెస్‌కు 1259, కక్కిరాలపల్లిలో బీఆర్ఎస్‌కు 705, కాంగ్రెస్‌కు 1,068, నందనంలో బీఆర్ఎస్‌కు 769, కాంగ్రెస్‌కు 1,425, రాంనగర్‌లో బీఆర్ఎస్‌కు 243, కాంగ్రెస్‌కు 461, ఉడుతగూడెంలో బీఆర్ఎస్‌కు 174, కాంగ్రెస్‌కు 230, లింగమోరిగూడెంలో బీఆర్ఎస్‌కు 154, కాంగ్రెస్‌కు 217, రెడ్డిపాలెంలో బీఆర్ఎస్‌కు 145, కాంగ్రెస్‌కు 235, ఓట్లు పోల్ అయ్యాయి. ఈ 13 గ్రామాల్లో కాంగ్రెస్‌కు 4,054 ఓట్ల లీడ్ వచ్చింది. మొత్తంగా మూడు గ్రామాల్లో బీఆర్ఎస్‌కు వచ్చిన లీడ్ పోగా మండల వ్యాప్తంగా కాంగ్రెస్‌కు 3,740 ఓట్ల ఆధిక్యం లభించింది. కేఈఆర్‌కు ఐనవోలు అండగా నిలిచినట్లు నాయకులు అంటున్నారు.

కాంగ్రెస్ శ్రేణుల సంబురాలు


సంబురాలు చేసుకుంటున్న నాయకులు

దామెర: అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడంతో సోమవారం మండల వ్యాప్తంగా ఆ పార్టీ శ్రేణులు సంబురాలు జరిపారు. మండల కేంద్రంలో యువకులు బైక్ ర్యాలీ నిర్వహించి టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డికి అనుకూలంగా నినాదాలు చేశారు. సీనియర్ నాయకులు గంగిడి శ్రీధర్‌రెడ్డి, పోషయ్య, ప్రవీణ్‌కుమార్, మండల ప్రధానకార్యదర్శి భిక్షపతి, ఉపసర్పంచ్ నాగేశ్వర్‌రావుతో పాటు యువకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఊరుగొండలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో గుడిపాటి శ్రీధర్‌రెడ్డి, రాంచందర్, కందికొండ సంపత్ పాల్గొన్నారు.

ప్రజలకు రుణపడి ఉంటా

శాయంపేట : అసెంబ్లీ ఎన్నికల్లో తనకు ఓటువేసిన ప్రజలకు రుణపడి ఉంటానని తెలంగాణ కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థి వంగరి సాంబయ్య అన్నారు. మండల కేంద్రంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వివిధ రాజకీయ పార్టీల నాయకులు ప్రలోభాలకు గురిచేసినా వెనకడుగు వేయకుండా తనకు ఓటువేసిన ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

క్లుప్తంగా

ఓపెన్ ప్రవేశాలకు గడవు పెంపు

శాయంపేట : ఓపెన్ స్కూల్‌లో 10వ తరగతి, ఇంటర్ ప్రవేశాలకు ఈ నెల 11వ తేదీ వరకు గడవు పొడగించినట్లు సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సుభాషిణి దేవి సోమవారం ప్రకటనలో తెలిపారు. స్పెషల్ ఎన్రోల్మెంట్ డ్రైవ్‌లో భాగంగా గడువు పొడిగించినట్లు ఆమె తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 11వ తేదీలోగా తెలంగాణ ఓపెన్‌స్కూల్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ప్రత్యేక పూజలు చేసిన సర్పంచ్



వేలేరు : అసెంబ్లీ ఎన్నికల్లో స్టేషన్‌ఘన్‌పూర్, జనగామ నియోజవర్గాల నుంచి ఎమ్మెల్యేలుగా కడియం శ్రీహరి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి గెలుపొందడంతో మండలంలోని మల్లికుదుర్ల సర్పంచ్ గొదెల రాజిరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. స్థానిక శ్రీగట్టు మల్లికార్జునస్వామి ఆలయంలో సోమవారం సర్పంచ్ దంపతులు ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు.

7న వేలంపాట

ఎల్కతుర్తి: భీమదేవరపల్లి మండలం కొత్తకొండలోని వీరభద్రస్వామి దేవాలయంలో ఈనెల 7న టెండర్ కమ్ బహిరంగ వేలంపాట నిర్వహించనున్నట్లు ఆలయ సీఓ కిషన్‌రావు సోమవారం ప్రకటనలో తెలిపారు. 2024 కొత్తకొండ వీరభద్రస్వామి జాతర సందర్భంగా దేవస్థానం ఆవరణలో కొబ్బరికాయలు, గుమ్మడికాయలు, కోరమీసాలు విక్రయించుకునేందుకు వివిధ లైసెన్స్‌లు పొందేందుకు గాను ఈనెల 7వ తేదీన వేలంపాట నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల వారు దేవస్థానం ఈఓ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

కేయూలో ఇద్దరికి డాక్టరేట్


సుమలత


యాకయ్య

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో ఇద్దరు పరిశోధకులకు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. ఫర్ఫార్మన్స్ అప్రైసల్ ఇన్ కోల్ ఇండస్ట్రీ – ఏ స్టడీ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల పరిశోధకురాలు సంగాల సుమలతకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ మల్లారెడ్డి తెలిపారు. ఆ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ కే.సాయిలు పర్యవేక్షణలో సుమలత తన పీహెచ్‌డీ పూర్తిచేశారు. అలాగే, స్టడీ ఆన్ ది కో ఎఫీసియంట్ ఇన్‌క్వాలిటీస్ ఫర్ సమ్ సబ్‌క్లాసెస్ ఆఫ్ అనాలటిక్ ఫంక్షన్స్ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి గణిత విభాగం పరిశోధకుడు కే.యాకయ్యకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు మల్లారెడ్డి పేర్కొన్నారు. ఆ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్.భారవి శర్మ పర్యవేక్షణలో యాకయ్య తన పీహెచ్‌డీ పూర్తిచేశారు.

భక్తితో జ్ఞానాన్ని ఆర్జించాలి

రామన్నపేట: విద్యార్థులు భక్తిని పెంపొందించుకొని జ్ఞానాన్ని ఆర్జించాలని శ్రీమాన్ సముద్రాల శఠకోపాచార్య అన్నారు. నగరంలోని ఏవీవీ కళాశాలలో సోమవారం నిర్వహించిన పోతన జయంతి వేడుకల్లో ఆయన మాట్లాడారు. భాగవత కథ ప్రారంభ ముఖ్య ఘట్టాలని విద్యార్థులకు వివరించారు. అనంతరం, కళాశాల ప్రిన్సిపాల్ భుజేందర్‌రెడ్డి మాట్లాడుతూ 60ఏళ్ల నుంచి విద్యార్థులకు భాగవత పద్య పఠన పోటీలు నిర్వహిస్తూ బాల్యం నుంచే పిల్లల్లో ఆధ్యాత్మిక స్పృహను కలిగిస్తున్నట్లు చెప్పారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పద్యపఠన పోటీల విజేతలకు అతిథులు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ పీఎల్ఎన్ ప్రసాద్, డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు, ఏవీవీ విద్యాసంస్థల కార్యదర్శి, కరస్పాండెంట్ చందా విజయకుమార్, శాశ్వత సభ్యులు చందా శ్రీకాంత్, పాలకవర్గ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

10న 'మోషన్' టాలెంట్ టెస్ట్

హన్మకొండ: హనుమకొండ నయీంనగర్‌లోని మోషన్ కళాశాలలో ఈనెల 10న టాలెంట్ టెస్ట్ నిర్వహించనున్నట్లు కళాశాల చైర్మన్ వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ తెలిపారు. కళాశాలలో టాలెంట్ టెస్ట్ బ్రోచర్‌ను సోమవారం ఆవిష్కరించారు. మోషన్ టాలెంట్ టెస్ట్‌ను ఈనెల 10న ఉదయం 11నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు కళాశాలలో నిర్వహించనున్నట్లు వివరించారు. టెస్ట్‌లో మెరిట్ సాధించిన 500మంది విద్యార్థులకు ఉచిత కోచింగ్, రూ.125 కోట్ల స్కాలర్‌షిప్‌లు, రూ.75 లక్షల క్యాష్‌ప్రైజ్ రాజస్థాన్‌లోని కోటా ప్రధాన బ్రాంచీ నుంచి అందించనున్నామని, హనుమకొండ బ్రాంచ్ వారు ప్రత్యేకంగా ఈ టాలెంట్ టెస్ట్‌లో మెరిట్ సాధించిన మొదటి ముగ్గురు ర్యాంకర్లకు రూ.10 లక్షల విలువ గల ఉచిత హాస్టల్‌తో కూడిన కోచింగ్, మొదటి 3ర్యాంకర్లకు ట్యాబ్‌లు, తర్వాత మూడు ర్యాంకులు సాధించిన విద్యార్థులకు రూ.6 లక్షల విలువ గల ఉచిత కోచింగ్ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

ఓడినా ప్రజలకు అందుబాటులో ఉంటా

- కార్యకర్తలు అధైర్యపడొద్దు
- ప్రజల పక్షాన నిలబడి ప్రతిపక్ష పాత్ర పోషిస్తా
- మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి


మాట్లాడుతున్న చల్లా ధర్మారెడ్డి

పరకాల: పదేళ్లు అవకాశం ఇచ్చిన ప్రజలు మార్పు కోరుకోవడంతో నియోజకవర్గంలో తాను ఓడిపోయాయని, అయినా ప్రజలకు అందుబాటులో ఉంటు వారి కష్టసుఖాల్లో పాల్పంచుకుంటానని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిపించిన ప్రజలకు రుణపడి ఉంటానన్నారు. 10 సంవత్సరాల పాలనలో నియోజకవర్గ అభివృద్ధి కోసం తాను, కుటుంబ సభ్యులు కష్టపడ్డామని, కానీ ప్రజలను ఏనాడు బాధపెట్టలేదన్నారు. తన వలన ఎవరికైనా ఇబ్బందులు తలెత్తితే క్షమించాలని ఆయన కోరారు. రాజకీయంలో గెలుపు, ఓటమి సహజమని, కార్యకర్తలు అధైర్యపడొద్దని సూచించారు. ప్రజలు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తూ ప్రజల పక్షాన నిలబడి ప్రతిపక్ష పాత్ర పోషిస్తానని అన్నారు. అయితే అంతకుముందు మీడియాతో మాట్లాడేందుకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంకు వచ్చిన ధర్మారెడ్డిని చూసిన బీఆర్ఎస్ మహిళ కార్యకర్తలు కంటతడి పెట్టారు. ఎవరూ బాధపడొద్దని ధర్మారెడ్డి ధైర్యం చెప్పారు. ఈ సమావేశంలో పట్టణ అధ్యక్షుడు మడికొండ శ్రీను, మున్సిపల్ వైస్ చైర్మన్ రేగూరి విజయ్‌పాల్‌రెడ్డి, నాయకులు నిప్పాని సత్యనారయణ, సోదా రామకృష్ణ, పావుశెట్టి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రేణుకా ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన

శాయంపేట : మండలంలోని తహరాపూర్‌లో గౌడ కులస్తుల ఆరాధ్య దైవమైన రేణుకా ఎల్లమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. దంచనాల వీరభద్రాచార్యులు, బాణాల లక్ష్మణాచార్యులు, కడివండి రమేష్‌శర్మ, కాగితాల పున్నమాచార్యులు, చీర్లంచ సూర్యనారాయణచార్యులు, ఆసం సుదర్శనాచార్యులు, పానుగోటి రాజేశ్వరచార్యులు వేదమంత్రోచ్చారణల మధ్య అత్యంత వైభవంగా ప్రతిష్ఠించారు. అనంతరం గణపతిపూజ, పుణ్యాహవచనం, వాస్తు పూజ, వాస్తు హోమం, సర్వగ్నికరణం, గర్తన్యాసం, రత్నాన్యాసం, బీజాన్యాసం, మహా నైవేద్యం, మంత్రపుష్పం, మహాదాశీర్వచనం, కుష్మాండ పూజలు నిర్వహించారు. రేణుక ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో భాగంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. సర్పంచ్ తాటికొండ మౌనికరవికిరణ్ గౌడ్, గౌడ కులస్తులు తదితరులు పాల్గొన్నారు.


ప్రతిష్ఠించిన ఎల్లమ్మ తల్లి విగ్రహం

కుంకుమేశ్వరస్వామి ఆలయంలో అన్నదానం


స్వామివారికి లక్ష పుష్పార్చన చేస్తున్న భక్తులు

పరకాల: కార్తీక మాసోత్సవాలను పురస్కరించుకొని పట్టణంలోని శ్రీకుంకుమేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోమాళ్లపల్లి సంపత్‌కుమార్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించగా మాదారం పీఏసీఎస్ వైస్ చైర్మన్ చందుపట్ల రాజేందర్‌రెడ్డి కుటుంబ సభ్యులు భక్తులకు మహాఅన్నదానం చేశారు. ఆలయ చైర్మన్ గందె వెంకటేశ్వర్లు, ఆలయ ప్రధాన అర్చకుడు కోమాళ్లపల్లి నాగభూషణంశర్మ, ధర్మకర్తలు పాల్గొన్నారు.

లక్ష పుష్పార్చన

పట్టణంలోని శ్రీకుంకుమేశ్వరస్వామి దేవస్థానంలో కార్తీక మాసోత్సవం సందర్భంగా సోమవారం సాయంత్రం గందె ఉదయలక్ష్మి, సదానందం దంపతులు లక్ష పుష్పార్చన కార్యక్రమం నిర్వహించారు. అదే విధంగా సాయంత్రం ఆకాశదిపోత్సవం, పల్లకి సేవ కనులపండువగా నిర్వహించారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ల పంపిణీ

ఎల్కతుర్తి: మండల కేంద్రంలోని మోడల్‌స్కూల్‌లో పదోతరగతి చదువుతున్న విద్యార్థులకు హుజూరాబాద్‌కు చెందిన గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ వారు సోమవారం పరీక్ష ప్యాడ్లు అందించారు. ట్రస్టు నిర్వాహకుడు గంగిశెట్టి జగదీశ్వర్, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ స్వరూప పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు కష్టంతోపాటు ఇష్టపడి చదివి మంచి ర్యాంకులు సాధించాలని కోరారు. చదువుపై శ్రద్ధ వహిచాలని, తల్లిదండ్రులు పిల్లల నడవడికపై దృష్టి వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీ రాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.


పరీక్ష ప్యాడ్లు అందజేస్తున్న జగదీశ్వర్

ప్రారంభమైన విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం

దామెర: మండలంలోని వెంకటాపూర్‌లో శివాలయ ప్రతిష్ఠాపన మహోత్సవం సోమవారం భక్తి శ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. వేడుకల్లో భాగంగా గణపతిపూజ, పుణ్యాహవాచనం కార్యక్రమాలు శాస్త్రీయ పద్ధతిలో వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య నిర్వహించారు. కాగా వేడుకల్లో పెద్దఎత్తున శివభక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణ కమిటీ చైర్మన్ పున్నం సంపత్ మాట్లాడుతూ.. మరో మూడు రోజుల పాటు కొనసాగనున్న వేడుకల్లో మండల వ్యాప్తంగా పెద్ద ఎత్తున శివ భక్తులు పాల్గొని వేకలను విజయవంతం చేయాలని కోరారు. గురువారం ఉదయం 8.49 గంటలకు యంత్ర ప్రతిష్టాపన, విగ్రహ ప్రతిష్ఠ, ప్రాణప్రతిష్ఠ, దిష్టికుంభం కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వేడకల్లో కమిటీ సభ్యులు అంకూస్, శ్రీనివాస్, సంపత్‌కుమార్, సదాశివుడు, కైలాష్, రాజు, రవీందర్, రాజ్‌కుమార్, రజినీకాంత్, బాబురావు, శ్రీధర్, నాగరాజు పాల్గొన్నారు.


పూజా కార్యక్రమంలో పాల్గొన్న చైర్మన్ దంపతులు

బీఆర్ఎస్ కంచుకోటకు బీటలు

- ఆవిర్భావం నుంచి ప్రతీసారి గులాబీ రెపరెపలు
- ఇప్పుడు బీఆర్ఎస్‌ను కాదని కాంగ్రెస్‌కు పట్టం కట్టిన ఓటర్లు

హన్మకొండ: బీఆర్ఎస్ కంచుకోట బీటలు వారింది. మలిదశ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమ పార్టీగా ఆవిర్భవించిన టీఆర్ఎస్ (బీఆర్ఎస్) వరంగల్ పశ్చిమ ఎన్నికల్లో ప్రతీసారి విజయం సాధిస్తూ కంచుకోటగా మలచుకుంది. 2023 శాసనసభ ఎన్నికల నాటికి పటిష్టంగా ఉన్నట్లు కనిపించినా ఫలితాల నాటికి చతికిల పడింది. పార్టీ ఆవిర్భావం నుంచి ఏ ఎన్నికల్లోనూ పట్టుసడలని బీఆర్ఎస్ కంచుకోట.. ఈ ఎన్నికల్లో బీటలు వారింది. కాంగ్రెస్ అభ్యర్థి నాయిని రాజేందర్ రెడ్డికి 72,649 ఓట్లు రాగా, బీఆర్ఎస్ దాస్యం వినయ్‌భాస్కర్‌కు 57,318 ఓట్లు పోలయ్యాయి. రాజేందర్ రెడ్డి 15,331 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. 2001లో టీఆర్ఎస్ (బీఆర్ఎస్) ఆవిర్భావం తర్వాత మొదటిసారి 2004లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసన సభకు ఎన్నికలు జరిగాయి. కాంగ్రెస్, టీఆర్ఎస్ కలిసి పోటీ చేశాయి. అప్పటి హనుమకొండ నియోజకవర్గం నుంచి టీఆర్ఎస్ అభ్యర్థి మందాడి సత్యనారాయణ రెడ్డి విజయం సాధించారు. 2009 నియోజకవర్గాల పునర్విభజనతో వరంగల్ పశ్చిమ నియోజకవర్గం ఏర్పడింది, అప్పటి నుంచి 2018వరకు జరిగిన ప్రతీ అసెంబ్లీ ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ విజయం సాధించి వరంగల్ పశ్చిమ నియోజకవర్గాన్ని కంచుకోటగా మలచుకుంది. 2023లో జరిగిన ఎన్నికల్లో కంచుకోట బీటలు వారింది. 2009లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్ రెడ్డి హయాంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 12 స్థానాల్లో 4 స్థానాల్లో టీడీపీ విజయం సాధించగా, 7 స్థానాల్లో కాంగ్రెస్ గెలిచింది. ఒక్క వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోనే బీఆర్ఎస్ (దాస్యం వినయ్‌భాస్కర్) విజయం సాధించింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో మిగతా నియోజకవర్గాల్లో పార్టీల విజయం మారినా పశ్చిమ నియోజకవర్గంలో మాత్రం పట్టు నిలుపుకుంటూ వచ్చింది. ఇలాంటి నియోజకర్గంలో మంచి రేసులో ఉన్న కారు ఒక్కసారిగా బోల్తా కొట్టింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2009లో హనుమకొండ నియోజకవర్గంలో నుంచి మందాడి సత్యనారాయణ రెడ్డి, నియోజకవర్గాల పునర్విభజన అనంతరం 2009లో వరంగల్ పశ్చిమ నుంచి దాస్యం వినయ్‌భాస్కర్, 2010లో జరిగిన ఉప ఎన్నికల్లోనూ దాస్యం వినయ్‌భాస్కర్, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత 2014, 2018లో జరిగిన ఎన్నికల్లోనూ దాస్యం వినయ్‌భాస్కర్ వరుస విజయాలు సాధించారు. ఈసారి గెలుపుపై ఆశలు పెంచుకున్నా ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకత, వినయ్‌భాస్కర్ అనుచరుల వ్యవహార శైలి, కొంత క్యాడర్ పూర్తిస్థాయిలో సహకరించకపోవడం, పలు ఆరోపణల నేపథ్యంలో ప్రజలు, యువత, నిరుద్యోగులు, ఉద్యోగులు, విద్యావేత్తలు కాంగ్రెస్ వైపు మొగ్గు చూపడంతో వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో గులాబీ రేకులు వాడిపోయాయి. పోలింగ్ శాతం పెరిగితే కాంగ్రెస్ లాభిస్తుందని, పోలింగ్ శాతం తగ్గితే బీఆర్ఎస్‌కు అనుకూలంగా ఉండవచ్చని అంతకుముందు ఊహాగానాలు కొనసాగాయి. అయితే పోలింగ్ శాతం తగ్గినా బీఆర్ఎస్ ఓటమి పాలుకావడం, బీఆర్ఎస్ ఓట్లు కాంగ్రెస్‌కు మళ్లడంతో పాటు, బీజేపీ ఈసారి గణనీయమైన ఓట్లు రాబట్టుకుంది. బీఆర్ఎస్ ఓట్లను బీజేపీ కూడా చీల్చుకోవడం కాంగ్రెస్ విజయానికి అవకాశాలు పెరిగాయి. 2010లో జరిగిన ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ 74.85 శాతం ఓట్లు సాధించగా, కాంగ్రెస్ 17.71 శాతం ఓట్లు ఓట్లు వచ్చాయి. టీడీపీకి 4.88 ఓట్లు పోలయ్యాయి. 2014లో జరిగిన ఎన్నికల్లో 59.31 శాతం ఓట్లు సాధించగా, కాంగ్రెస్‌కు 19.31 శాతం, బీజేపీకి 13.2 శాతం ఓట్లు పోలయ్యాయి. 2018లో బీఆర్ఎస్ 56.78 శాతం ఓట్లు రాబట్టుకోగా, కాంగ్రెస్ పొత్తుతో పోటీ చేసిన టీడీపీకి 31.23 శాతం, బీజేపీకి 2.54 శాతం ఓట్లు పోలయ్యాయి. ఈసారి (2023లో) జరిగిన ఎన్నికల్లో 34.29 శాతం ఓట్లు వచ్చాయి. ఇక్కడ కాంగ్రెస్‌కు 43.46 శాతం, బీజేపీకి 18.44 శాతం ఓట్లు పోలయ్యాయి. 2010 నుంచి చూసుకుంటే బీఆర్ఎస్ విజయం సాధిస్తూ వచ్చినా ఓట్ల శాతం తగ్గుతూ వచ్చింది. 2018లో కాంగ్రెస్ పొత్తుతో పోటీ చేసిన టీడీపీకి 31.23 శాతం ఓట్లు రాగా, ఈసారి 43.46 శాతం ఓట్లు రాబట్టుకుని విజయం సాధించింది. అయితే, బీజేపీకి 2018లో 2.54 శాతం ఓట్లు రాగా, ఈసారి 18.44 శాతం ఓట్లు పోలయ్యాయి. గతంలో పోలిస్తే బీజేపీ ఈసారి 15.90 శాతం ఓట్లు అదనంగా రాబట్టుకుంది. గతంతో పోలిస్తే కాంగ్రెస్‌కు 12.23 శాతం ఓట్లు అధికంగా వచ్చాయి. బీఆర్ఎస్‌కు 22.49 శాతం ఓట్లు తగ్గాయి. బీఆర్ఎస్‌కు తగ్గిన ఓట్లు కాంగ్రెస్, బీజేపీకి మళ్లినట్లు విశ్లేషకులు చెప్పుతున్నారు.

కార్తీకమాస ప్రత్యేక పూజలు


ఖిలా వరంగల్: వ్రతం చేస్తున్న మహిళలు


కాశీ విశ్వేశ్వరాలయంలో అభిషేకం చేస్తున్న భక్తులు


కాజీపేట శ్వేతార్క ఆలయంలో ప్రత్యేక పూజలు..

కాశిబుగ్గ: కార్తీకమాసం సోమవారాన్ని పురస్కరించుకుని కాశిబుగ్గలోని కాశీ విశ్వేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున కాశీ విశ్వేశ్వరుడికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, అర్చనలు నిర్వహించారు. భక్తులు 9కిలోల నెయ్యి, తేనెతో ఆలయంలోని సహస్ర లింగానికి భక్తిశ్రద్ధలతో అభిషేకం చేశారు. పూజా కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బయ్యా స్వామి, వెంకన్న, నాగరాజు, రవికుమార్, శ్రీనివాస్, పోశాలు పాల్గొన్నారు.

శ్వేతార్క ఆలయంలో..

కాజీపేట: కార్తీక మాసోత్సవాలను పురస్కరించుకుని కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దేవాలయంలో పండితులు సప్తనది జలాలతో స్వామి వారికి సోమవారం ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తెచ్చిన నదీజలాల సహస్ర ధారలతో అభిషేకాలు జరిపించారు. హైదరాబాద్‌కు చెందిన పలువురు భక్తులు శ్వేతార్క ఆలయాన్ని సందర్శించి ఆలయ ఆవరణలోని 29 దేవతామూర్తులను దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ విశిష్టత, నిత్యపూజల వివరాలను ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు వెంకటేశ్వర్లు శర్మ భక్తులకు వివరించారు. వివిధ ప్రాంతాల నుంచి శ్వేతార్కుడి దర్శనం కోసం ప్రత్యేక వాహనాల్లో భక్తులు తరలిరావడంతో ఆలయ పరిసర ప్రాంతాలు కిక్కిరిసిపోయాయి. అన్నపూర్ణ భవన్‌లో భక్తులందరికి మహాన్నదానం చేశారు.

శాస్త్రోక్తంగా అనఘాష్టమి వ్రతం

ఖిలా వరంగల్: కార్తీక పౌర్ణమి సందర్భంగా వరంగల్ శివనగర్‌లోని సీతారామచంద్ర స్వామి దేవాలయం ప్రాంగణంలో సోమవారం అనఘాష్టమి వ్రతం నేతపర్వంగా జరిగింది. ఆలయ ప్రధాన పూజారి శివరామకృష్ణ చార్యులు, ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో వ్రతాన్ని నిర్వహించారు. మహిళలు పెద్దసంఖ్యలో పూజా సామాగ్రితో తరలివచ్చి భక్తిశ్రద్ధలతో వ్రతం పూజలు చేశారు. కార్యక్రమంలో మంచాల కృష్ణమూర్తి, శ్రీరాం రాజేష్, రావికంటి అశోక్, ఆడెపు శ్యాంసుందర్, యాదగిరి, శైలజ, రావికంటి శ్రీదేవి, మంచాల రాణి, కృష్ణవేణి, రాధిక, తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు టీషర్టుల పంపిణీ

హన్మకొండ: ఈనెల 4నుంచి 6వ తేదీ వరకు నిజామబాద్ జిల్లా బూసాపూర్‌లో జరగనున్న రాష్ట్ర స్థాయి మహిళా కబడ్డీ పోటీల్లో పాల్గొనే వరంగల్ క్రీడా జట్టుకు టీషర్టులను పంపిణీ చేశారు. హనుమకొండలోని జేఎన్ స్టేడియంలో సోమవారం జరిగిన పంపిణీ కార్యక్రమంలో కబడ్డీ సంఘం వరంగల్ జిల్లా కార్యదర్శి ఎండీ.అబ్దుల్లాఖాన్, ఉపాధ్యక్షుడు రాంరెడ్డి, జాయింట్ సెక్రటరీ మల్లికార్జున్, కోచ్ నారాయణ, బాధ్యులు అస్లాంఖాన్, వినయ్‌కుమార్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. అలాగే, ఈనెల 5నుంచి 8వ తేదీ వరకు గద్వాలలో జరగనున్న ఎస్‌జీఎఫ్ అండర్ –17 బాలుర క్రికెట్ జిల్లా జట్టు క్రీడాకారులకు వరంగల్ క్రికెట్ అసోసియేషన్ మాజీ కార్యదర్శి ఉదయభానురావు టీషర్టులను పంపిణీ చేశారు. హనుమకొండలోని జేఎన్ స్టేడియంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో వెంకట్‌రెడ్డి, కుమార్, కోదండపాణి, ప్రభాకర్, శంకర్, రఘు, సుమన్, ఇంద్రసేనారెడ్డి తదితరులు పాల్గొన్నారు. క్రీడాకారులను ప్రోత్సహిస్తు కబడ్డీ సంఘం అండగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు.